

# సిక్స్త్ సెన్స్

**బీనా దేవి**

"ఈ చోద్యం విన్నారా? పాకిస్తాన్లో వేదాల్లేవుట!"

"సిక్కెమ్మ సిన్నకూతుర్ని సూసినావా గురూ? ఎంతె పోనాదో? యీవుమీద యిస్త్రీ పెట్టెయ్యొచ్చు"

"ఇట్స్ ప్లెజర్ మీటింగ్యూ."

"శ్వాస చంటాణ్ణి అందుకో తల్లీ"

"పొట్టివాడైనా గట్టివాడు మన లాల్ బహాదూరు."

ఈ థర్డ్‌క్లాస్ గొడవేమీ ఫస్ట్‌క్లాస్ దగ్గర నిలబడ్డ ఎ. ఎస్. వి. రాజేశ్వర్రావుకి వినిపించలేదు. అతనసలు ఫస్టుక్లాసు గొడవగాని, థర్డ్‌క్లాస్ గొడవగానిన్నీ వినిపించుకొనే స్థితిలో లేడు. తనే ఫస్టుక్లాసుకి మించిన ఒక పెద్ద ఎయిర్ కండిషన్డ్ గొడవలో పడిపోయేడు.

ఎయిర్ కండిషన్లో వున్నట్టే వళ్ళంతా చల్లబడిపోతూంది, మూడు గంటుల ఎండ పన్నెండు గంటుల దానా పేలిపోతున్నా, తల్లో మాత్రం జేన్ ఫర్నేస్ వున్నట్టుంది. అతనాపూర్లో వున్న నాల్నెల్లలోనూ, మూణ్ణెల్ల యిరవైతొంది రోజులు డాక్టర్ రాధ చుట్టూ పెంచిన ప్రేమలతను ఆమెకు చూపకుండానే దానిగురించి ఆమెకు చెప్పకుండానే

వెళ్ళిపోతున్నాడు. అలా వెళ్ళిపోవల్సి వచ్చింది. 'ఈ మూణ్ణెల్ల ఇరవైరోజుల్లోనూ ఎవరూ యింకెవర్నీ ఒక జీవితకాలంలో ప్రేమించలేనంత ప్రేమించేను రాధా' అని ఆమెతో చెప్పాలనీ, యింకేమేమో చెయ్యాలనీ అతనికి ఎంతగానో వుంది. కాని చుట్టూ ఎంతో మంది యూనిఫారాల్లో వున్న సబార్డినేట్సున్నారు. ప్రపంచమంతా తోలు జోళ్ళతోనూ, తోలు పటకాలతోనూ, సబార్డినేట్సు తోలు మొహాల్తోనూ చేసినట్టుంది తోలు కంపు కొడ్తోంది.


రాజేశ్వర్రావు ఆ వూరొచ్చి సరిగ్గా నాల్నెల్లైంది. వచ్చిన మర్నాడే పెళ్ళికాని డాక్టర్రాధని చూసేడు. మర్నాటి వరకూ ఆగకుండా చూసినప్పుడు 'ఈమెను పెళ్ళాడేవాడు ధన్యుడు' అన్న నిశ్చయానికి వచ్చేడు. మర్నాడు మాత్రం ఆ ధన్యత తనకే ఎందుకు దక్కకూడదని తర్కించుకున్నాడు. నెల తిరక్కుండా తనకే చెందాలని నిశ్చయించుకున్నాడు. రెణ్ణెల్లకే తన రైవల్ సూటర్ డాక్టర్రాజు మీద ప్రొహిబిషను కేసు పెడదామా, పేకాటకేసు పెడదామా అని ఆలోచించేడు. అతని ఆలోచన తేలేలోగానే డాక్టర్రాజు ట్రాన్స్ఫరై వెళ్ళిపోయేడు. అప్పుడు గవర్నమెంటుద్యోగులకు ట్రాన్స్ఫరుండడం మంచిదనుకున్న రాజేశ్వర్రావు తనకి ట్రాన్స్ఫర్రాగానే తన అభిప్రాయం మార్చుగున్నాడు.

రాజేశ్వర్రావుకి తన డిపార్టుమెంటు ఓవర్హాల్ చెయ్యాలనీ, చెయ్యవలసిన అవసరం ఎంతేనా వుందని ఎప్పుడూ అనిపిస్తుంది. శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాడు కూడా. 'ఫర్వాలేదు. కష్టపడి పని చేస్తే ముందుకొస్తాడు' అన్నాడు తననైనా పొగుడుకోలేని ఎస్పీ రాజేశ్వర్రావు గురించి.

ఈ ఊరొచ్చిన కొద్ది రోజులకే మంచిపేరు అలవాటు ప్రకారం తెచ్చుగున్నాడు రాజేశ్వర్రావు. అతనొచ్చేక సైకిల్ చోరీలు తగ్గిపోయేయి. వ్యభిచారం గూఢంగానే సాగేది. అతను 'రౌడీల్లో రౌడీ, తగు మనుషుల్లో తగుమనిషి' అని హర్షించేరు ప్రజ. అతని సబార్డినేట్సుకి మాత్రం అతన్లో తగు మనిషి చిహ్నాలు తక్కువగానే కనిపించేయి.

'మన డిపార్టుమెంటుకి పరువూ మర్యాదా లేకుండా పోయేయి. దానిక్కారణం సహం చరిత్రా, సహం మనమూను.

ఏ రాష్ట్రంలో ఎవరికి ఏ భాష వద్దన్నా, ఏ ఊళ్లో ఎవరికి బియ్యం తక్కువైనా, ఏ పల్లెలో కిరసనాయిలు సమంగా కాలకపోయినా ముందు తన్నుతినేది మనం. దీనిక్కారణం పూర్వం మనవాళ్ళు తెల్లయముళ్ళ భటుల్లా ప్రవర్తించడమే..



ఇక పోతే మనం ప్రస్తుతం చేసే పన్లుకూడా ఏమంత బావుండలేదు. మన్లోనే కొంతమంది — ఎక్కువమంది కాకపోవచ్చు- పాకెట్టు కొట్టేవాళ్ళకి పెర్మిట్లిస్తున్నారు. సారా వండేవాళ్ళకీ, అమ్మే వాళ్ళకీ లైసెన్సు లిస్తున్నారు – ఈ చీడ పురుగులు నశించాలి.

మన డిపార్టుమెంటుకి సరైన కీర్తి రావాలంటే సారా అమ్మించడం, దొంగతనాలు చేయించడం మానేసినంత మాత్రాన సరిపోదు. నేరాలు జరిగేక ముద్దాయిలను పట్టుకున్నంత మాత్రాన చాలదు.

అసలు నేరాలే జరక్కుండా చూడాలి. దీనికి దొంగని చూడగానే గుర్తించే శక్తి మనకుండాలి. మన కావలసింది—ఒక విధమైన సిక్స్త్ సెన్స్. నాకు తెలుగు సరిగ్గా రాదు. దాన్ని మీరు ఆరో ఇంద్రియమే అంటారో, ఆరో జ్ఞానమే అంటారో అనండి. కాని ఆ సెన్స్ మనందరికి వుండాలి. దాన్ని మనమంతా కల్టివేట్ చెయ్యాలి" అని రాజేశ్వరావెప్పుడూ బాహాటంగానే అంటువుంటాడు తన సబార్డినేట్సుతో.

తన సన్నిహిత స్నేహితుల్తో మాత్రం ప్రైవేటుగా "వెల్లూర్లోనూ అనంతపూర్లోనూ తయారయే ఈ నాటు సరుక్కి ఎక్కణ్ణించి వస్తుందీ సెన్సు? మౌంట్ అబూలో అర్పిదయ్యే మాకు - అంటే ఐ.పి.యస్.

వాళ్ళకి మాత్రం వద్దన్నా వస్తుంది" అంటాడు.

ఈ వూర్లో తన సబార్డినేట్సులో ఒకరిద్దరికే సెన్సు వున్నట్టనిపించిందతనికి. వాళ్ళచేత ఆ సెన్స్ కల్టివేట్ చేయించేలోగానే తనకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరొచ్చింది.

సరిగ్గా మూడ్రోజుల కింద "విజయవాడలో ఎవరో ఎవరిళ్ళో తగలబెట్టేస్తున్నారు. అక్కడికి వెళ్ళి ఏం చెయ్యాలో చెయ్, నిన్నక్కడికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం" అంది ప్రభుత్వం అతన్తో. "ఫైరింజన్నై యిళ్ళు ఆర్పమంటారా? అశోక సమ్రాట్టునై కొత్తిళ్ళు కట్టించమంటారా? నేనేం చేస్తాను" అని విసుక్కున్నా వెళ్ళక తప్ప లేదతనికి.

ఈ మూడ్రోజుల్లోనూ తన ప్రేమ వ్యక్తం చేయడానికి రాజేశ్వ్రావుకి రెండు ఆటంకాలొచ్చేయి. రోజుకు మూడు పార్టీల చొప్పున యీ మూడ్రోజులు పార్టీలు యిచ్చిన స్నేహితులు మొదటి ఆటంకం. రాత్రి తప్ప పగలు ప్రసవించమనే రాధ పేషెంట్లు రెండో ఆటంకం.

వెన్నెల్లాంటి మల్లెపూలు—మల్లెపూల్లాంటి వెన్నెలా లేకపోయినా, ఎస్పీ పెళ్ళాం కోపంలా మండిపోయే ఎండలో ఎలా వ్యక్తపరచడం తన ప్రేమ అని అంతవరకూ అనుకుంటూన్న అతను "ఎండైనా వానైనా ఇప్పుడు చెప్పేద్దును ఒక్క క్షణం ఏకాంతం వుంటే" అని అనుకుంటూ వుంటే, రైలు కదలడం, గంట కొట్టడం, గంటలా ఖంగుమని "వెల్ సో లాంగ్" అంటూ జెండా ఊపినట్టు రాధ చెయ్యూపడం, జెండాలు ఊపడం, 12 జతల పోలీసు జోళ్ళ చప్పుళ్ళతో, పోలీసు సలాములు, రాజేశ్వ్రావు ఒక్కసారి రైల్లోకి దూకడం ఒక్క క్షణంలో జరిగిపోయేయి.


"ఒక్క క్షణం ఏకాంతం, ఒక్క ఏకాంత క్షణం" అనుకుంటూ రైల్లో ప్రవేశించిన అతనికి "ఈ రోజుల్లో ఫస్టుక్లాసులో కూడా ఏకాంతం లేద"నిపించింది.

పేషెంటులా వాలిపోయిన ఒక తెల్లని ఏభై అయిదు సంవత్సరాల నాజూకైన ముసలాయన శాలువ కప్పుకుని ఒక బెర్తుమీద పడుకున్నాడు. ఆడవాళ్ళకుండవలసిన సన్నని ఎత్తయిన ముక్కూ, శాసించే మెరక కళ్ళు, సిగరెట్లు కాల్చినా నల్లపడని సొంపైన పెదాలతో 'కాలంలో వున్నప్పుడు చాలా కొంపలకి నిప్పెట్టి వుంటాడన్నట్టు వున్నాడు అతని జుత్తులాగే, తెల్లబడ్డ రోజున్నర పెరిగిన తెల్లగడ్డం అతనికి అందమే తెచ్చిందని ఒప్పుకోక తప్పదు. పై బెర్తుమీద అతని జిప్ సూట్ కేసూ, హోల్డాలూ వగైరా సామానున్నాయి. అతను ఫారిన్ మాగజైను చదువుకుంటున్నాడు.

రెండో బెర్తుమీద కైతోపహో టెర్లిన్ సూట్లో వున్న 30 ఏళ్ళ

నల్లటివాడు పక్కనున్న జిప్ బేగ్ లోంచి అస్తమానూ రుమాలు వేసి మొహం తుడుచుకుంటూ, నాలికతో పెదాలు తడువుకుంటూ, లేని సున్నితం తెచ్చిపెట్టుకుంటూ కూర్చున్నాడు. చేతిలో వున్న తెలుగు పత్రిక చదవకుండా. మనిషి చూస్తే టెర్లిన్ చొక్కా తొడుక్కున్న పులిలా వున్నాడు. జీవితంలో పనంటే ఏమిటో ఎరగని వాడని అతన్ని చూడగానే అనిపిస్తుంది. రాజేశ్వర్రావు కతన్ని చూడగానే అలానే అన్పించి అసహ్యం వచ్చిందతనిమీద. మేనకని చూసిన విశ్వామిత్రుడిలా ముసలాయన్ని చూడగానే రాజేశ్వర్రావు కభిమానం ముంచుకొచ్చింది. ఎంత చెప్పినా ఫారిన్ కల్చరుంది అతన్లో. “ఫారిన్ వెళ్ళేవుంటా” డనుకున్నాడు రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావుని చూడగానే ముసలాయన వేలకి విలువైన నవ్వు పారేసేడు. ఉరివేసేముందు జడ్జిగారి నవ్వులా లేదా నవ్వు. కన్నతల్లి చూపులా చల్లగానూ, వెన్నెల చాటు ప్రియురాలి పలకరింపులా వెచ్చగాను వుంది. (మేనక కూడా విశ్వామిత్రుడిమీద యిలాటిదే వదిలుండాలి). ముసలాయనే స్టేట్ ఎక్స్ప్రెస్ సిగరెట్టు ఆఫర్ చేస్తూ రాజేశ్వర్రావుతో మాటలు కలిపేడు. తనను తానే పరిచయం చేసుకున్నాడు. ఢిల్లీలో ఏదో పెద్ద మందుల కంపెనీకి అసిస్టెంట్ మేనేజరుట. నాల్నెళ్లై కిడ్నీ ట్రబుల్తో



బాధపడుతున్నాట్ట. మరో మూణ్ణెల్లకి కాని ఆపరేషను చెయ్యమన్నారుట. ఆపరేషను చేయించుకునేలోగానే "మనవాళ్ళ" నందర్నీ చూద్దామని యీ ప్రాంతాలు వచ్చేట్ట. ఉదయం విశాఖపట్నంలో ఈ పాసింజెర్లో (ఈ మష్షి రైల్లో) బైల్దేరి కాకినాడ వెళ్దామనుకున్నాట్ట. కాని తోవలో తన బాధ లావైందిట. అంచేత నేరుగా విజయవాడ వెళ్ళిపోతున్నాట్ట. అక్కడ పెద్ద డాక్టర్—కిష్టయ్య — స్నేహితుడూ, క్లాస్ మేటూనట. ప్రాక్టీసు చెయ్యక పోయినా తనూ డాక్టరేనట. అంచేత తన జబ్బు ఎంత ప్రమాదమైందో తనకి తెలుసుట. "ఏఁవిఁటో చిన్నప్పుడు నేనూ కమ్యూనిస్టునే. ఐనా జీవితంలో చాలా భాగం చూసేక మన చేతుల్లో ఏఁవీఁ లేదనిపిస్తుంది, రేపొచ్చేది మనకు తెలియదు. కాస్తో కూస్తో హోదా వుంది. రెండు కార్లున్నాయ్. కావలసినంత డబ్బుంది. లక్ష్మీదేవిలాంటి ఇల్లాలుంది. అందొచ్చిన పిల్లలున్నారు. ఎన్నుంటే ఏం లాభం? దిక్కులేని చావు విజయవాడలో చావమని నాకు రాసేడేమో. ఇది చూసేకైనా భగవంతుణ్ణి మనం నమ్మక తప్పదు. వాడి ఆజ్ఞేదీ మనం కాదన్లేం" అని ముగించేడు ముసలాయన.

ముసలాయన వేదాంతం ముసలాయన్లాగే సింపుల్‌గానూ, కన్విన్సింగ్‌గానూ కన్పించింది రాజేశ్వర్రావుకి. అతని పరిస్థితికి చాలా బాధపడ్డాడు కూడా రాజేశ్వర్రావు.

ఆ తర్వాత ముసలాయన చాలా విషయాల గురించి చాలా చక్కగా మాట్లాడేడు. సాధన, సావిత్రిలలో ఎవరు గొప్ప? కామరాజు నాడార్కీ, కైజర్కీ వున్న పోలికలేవిఁటి? వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో పవర్లోకి రావడానికి కమ్యూనిస్టులకున్న ఛాన్సెస్ ఏఁవిఁటి? వాళ్ళు పరిపాలనకు వస్తే ఆ గండం తప్పించుకుందికి ప్రజలకున్న ఛాన్సెస్ ఏఁవిఁటి? అన్నీ తాను అలసిపోయినట్టు తెలీనివ్వకుండా నెమ్మదిగా వివరించేడు ముసలాయన. కాని అతను వినిపించనివ్వని మూలుగు రాజేశ్వర్రావుకి వినిపిస్తూనేవుంది. అర్ధరాజ్యం, కన్నకూతుర్నీ యివ్వడానికి రాజేశ్వర్రావు పాతకాలం రాజు కాడు. కాని ముసలాయనకి చేతనైన సాయం చేయాలన్పించింది. రాజేశ్వర్రావుకి, అతన్ని లేవనీకుండా అతనికి ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసిచ్చేడు. అతనికి తగిలేట్టు ఫాన్ ఫిక్స్ చేసేడు. అతని సిగరెట్టుకి అగ్గిపుల్ల కొట్టేడు.

ఏదో స్టేషన్లో కుర్రను పులి దిగిపోయేడు. అతను అంతవరకూ ఒక్క మాటైనా మాట్లాళ్ళేదు. అతను దిగి

పోగానే అతని గురించి రాజేశ్వ్రరావు "అతనేం చేస్తున్నాడంటారు" అనడిగేడు ముసలాయన్ని. "ఏ పనీ వున్న వాళ్ళా లేడు."


"ఐతే లేడీ డాక్టరు మొగుడై వుండాలి."

"లేపోతే నోట్లు అచ్చుకొట్టే వాడైనా ఐవుండాలి" అని శ్రుతి కలిపేడు ముసలాయన.

తర్వాత కొంతసేపటికి ముసలాయన బాత్‌రూములోకి వెళ్ళేడు. ఓ నిమిష మయ్యేక బాత్‌రూము తలుపు ఓరగా తెరచి తల బైటికి పెట్టి "దయచేసి ఆ బేగ్ కాస్త యిలా యిస్తారూ" అన్నాడు.

ఆ క్షణంలో అతన్ని ఎత్తుకు పరిగెత్తమన్నా పరిగెడ్తాడు రాజేశ్వ్రరావు. ఆ కొద్ది సేపట్లోనే ముసలాయన మొహం బాధతో వంకర్లు పోయింది. ఖలనంతాన ఎవరో గొంతు పిసికేస్తున్నట్టు గుడ్లు బాగా పైకి వచ్చేసేయి. వంట్లో వున్న రక్తమంతా మొహంలోకి దిగిపోయినట్టు, నల్లగా వుందా అని అనుమానం వచ్చేట్టు ఎర్రబడిపోయిందతని మొహం. పులినోటబడ్డ పసిపిల్ల పిలుపులా దీనాతి దీనంగా వుందతని మాట.

రాజేశ్వ్రరావు చప్పున బేగ్ అందించేడు. అందుకుని ముసలాయని మళ్ళీ తలుపు వేసేసుకున్నాడు. తొలిరాత్రి భార్యరాక కోసం ఎదురు చూసే భర్తలా రాజే



శ్వరరావు ఆత్రంగా బాత్‌రూము డోర్ వేపు చూస్తూ కూర్చున్నాడు.

కొన్ని నిమిషాలయ్యేక తలుపు తెరుచుకుని తల్లిని తగలబెట్టిన వాళ్ళా తడిపంచ భుజాన వేసుకుని ముసలాయన బైటకువచ్చి నీరసంగా గోడకు చేరబడిపోయేడు. అతను మరో పంచకట్టుకుని వున్నాడు. రాజేశ్వరరావు సానుభూతితో నడిపించుకు తీసుకొస్తూవుంటే 'గుడ్ గాడ్. రక్తం పడ్తోంది. ఇట్ హేజ్ స్టార్టెడ్ బ్లీడింగ్' అన్నాడు ముసలాయన.

ముసలాయన్ని బెర్తు మీద పడుకోబెట్టి నిండా శాలువ కప్పి 'ఇంకెంత సేపు? ఇంకో రెండు గంటల్లో చేరిపోతాం. రెస్టు తీసుకోండి' అని సలహా యిచ్చి రెండో బెర్తుమీద బైటకు చూస్తూ కూర్చున్నాడు రాజేశ్వరరావు.


బైటంతా దైవ సృష్టిలా వుంది.

ప్రకృతంతా ఆకుపచ్చ చీరకట్టిన గర్భవతిలా నిండుగా వుంది.

ఎన్నో పూదోటలతో సయ్యాటలాడిన చిరుగాలి ప్రియురాలి ముంగురులని ఊపినట్టు పచ్చటి చేలని ఊపుతోంది.

నెత్తిన గంపల్తో వయారంగా ఉల్లాసంగా కొత్తకోడళ్ళలా నడిచిపోతున్నారు రంగురంగుల చీరలు కట్టిన పల్లెపడుచులు.

తారతమ్యం లేకుండా అందరికీ



అన్నిటికి బంగారుపూతలు పూస్తున్న అస్తమించే సూర్యుడు.

వీటన్నిటికి అపశ్రుతిలా ముసలాయన బాధతో మూలుగుతున్నాడు.

● ● ●

రైలు విజయవాడ చేరేసరికి రాత్రి తొమ్మిద్దాటింది. ఊరు తగలబడిపోతున్నట్టు తగలబడి పోతోంది ఊరు. ఆకాశమంతా నల్లమబ్బుల్లాంటి పొగల్తోటి, వాటి నల్లదనం సుస్పష్టంగా కనిపించడానికి కావలసినంత మంటల్తోటి నిండివుంది.

భూలోకంలోని పాపం దేవుళ్ళుండే స్వర్గాన్ను తగలబెట్టేస్తుందా అన్నంత ఎత్తుకి లేస్తున్నాయి మంటలు.

రాక్షసి కన్యలు కురులు ముళ్ళు వేసుకుంటున్నట్టు సుళ్ళు తిరుగుతున్నాయి పొగలు.

వాడుకలో లేని శ్మశానంలా వుంది ప్లాట్‌ఫారం. రైల్లోంచి దిగే వారి హడావిడేగాని, ప్లాట్‌ఫారం మీద మనుషుల్లేరు. రైలుని చూసి పరుగెత్తుకు వచ్చేరు సి. ఐ., టూ టౌన్ ఎస్. ఐ, ముగ్గురు పి. సీ. లు,

'క్షమించండి సార్! మెన్ అంతా ఊళ్ళో డ్యూటీలో వున్నారు' అంటూ రాజేశ్వర్రావుని రిసీవ్ చేసుకున్నాడు సి. ఐ. సామాను పీ.సీ.లు దింపుతూ వుంటే 'క్షమించండి' అంటూ జారుకున్నాడు ఎస్. ఐ.

రాజేశ్వర్రావువీ, ముసలాయనవీ సామాన్లు చాలా మట్టుకు పి. సీ. లు పట్టుకున్నారు. సి. ఐ. కూడా రాజేశ్వర్రావుపెట్టి పట్టుకున్నాడు. ముసలాయన సూట్‌కేసు రాజేశ్వర్రావు ఫర్వా లేదంటూ పట్టుకున్నాడు.

టాక్సీ స్టేండు చేరేసరికి ఒకటే టాక్సీవుంది. 'ఇద్దరం ఇందులో ఎక్కేద్దాం' అని ముసలాయన్తో అని 'మీరు డ్యూటీ పాడుచేసుకోకండి. దారి చూపెట్టడానికి మాతో ఒక్క పి. సి. వస్తే చాలు' అని సి. ఐ. తో అని రాజేశ్వర్రావు వెనక సీట్లో ఎక్కేడు. అతని పక్కన ముసలాయనా, ముందు సీట్లో పి. సీ. ఎక్కేక బైలేరింది.

దార్లో నీరసంతో వణికే కంఠంతో ముసలాయన రాజేశ్వర్రావుకి కృతజ్ఞత తెలియజేసేడు. ఆవేశంతో వణికే కంఠంతో కొంపలికి నిప్పుపెట్టే ఏంటీ సోషల్ ఫోర్సెసుని శపించేడు. ఎ. ఎస్పీ. క్వార్టర్సు చేరేక రాజేశ్వర్రావుని దింపి అతన్ని టాక్సీబిల్లు ఇవ్వకుండా అతన్ని మరోసారి థేంక్ చేసి 'ఎలా వున్నదీ రేపు కబురుచేస్తా. వీలైతే నేనే వస్తా' అంటూ టాక్సీలో వెళిపోయేడు ముసలాయన.

● ● ●

ఊరికి రాజేశ్వర్రావు కొత్త. ఏ పని చేద్దామనుకున్నా వీలు

కాకుండా ఊళ్ళో పై అధికారులూ, మినిష్టర్లూ కేంపు. వాళ్ళ మర్యాదలు చూసేసరికే పొద్దుపోతోంది. 'ఇవా యిన్వెస్టిగేష నేవిఁటి? నా మొహం!' అని విసుక్కుంటూనే మూడ్రోజులు గడిపేసేడు రాజేశ్వ్రరావు.

నాలుగోనాడు ఉదయం మండుతున్న ఇళ్ళు ఆరిపోయినట్టుగా, తుఫాను వెలిసినట్టుగా సంతుష్టి నివ్వని ప్రశాంతతతో వుంది ఊరు. ఆ ముందు రాత్రి ఇళ్ళేమీ తగుల బళ్ళేదు. ఆ ఉదయమే చీటికీ మాటికీ ఒళ్ళు మండించుకునే అధికార్లు వగైరాలు వెళ్ళిపోయేరు. వాళ్ళని సాగనంపి ఇంటికొచ్చి బద్ధకంగా పక్కమీదవాలిన రాజేశ్వ్రరావుకి చెంపమీద కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లైంది టెలిఫోను మోగగానే.

రిసీవరు ఎత్తితే టూ టౌన్ ఎస్. ఐ. మాట్లాడుతున్నాడు.

'గుడ్ మార్నింగ్ సార్! (సలాం కొట్టిన జోళ్ళ చప్పుడు) దొంగనోట్లు అచ్చు కేసులో ముద్దాయి దొంగనోట్లతో సహా దొరికిపోయేడు సార్. రిమేండుకు పంపేలోగా మీరు చూస్తానంటే బంగళాకి తీసుకొస్తాను సార్' అన్నాడు ఎస్. ఐ.

'సర్లె. తీసుకురా' అన్నాడు రాజేశ్వ్రరావు. ఖూనీలు చేసిన వాణ్ణీ, నోట్లు అచ్చుకొట్టేవాణ్ణీ, సినిమాలో వేసేవాణ్ణీ, ఎలక్షన్లో గెల్చిన వాణ్ణీ చూద్దామనే సామాన్యుని కుతూహలంలో ఏమీ విడ్డూరం లేదు.

'కాని ఎంత విడ్డూరం' అనుకున్నాడు రాజేశ్వ్రరావు, ఖలగలాగ సాగి సలాంకొట్టి టూ టౌన్ ఎస్. ఐ. జిప్‌నూట్‌కేసో సహా ముసలాయన్ని హాజరు పెట్టినప్పుడు.

కేసు వివరాలు తెలుసుకున్నాక 'నీ ఆరోగ్యం ఎలా వుంది' అని ముద్దాయి నడిగేడు రాజేశ్వ్రరావు.

'వీడికేం తక్కువ సార్! ముసలి నక్కలా అలా వున్నా పులిలా నలుగురితో పెనుగులాడేడు సార్ మేం పట్టుకున్నప్పుడు' ఎస్. ఐ. జవాబు చెప్పేడు.

• • •

'తవఁరొచ్చిన బండికే కొంత ఫ్రీట్ నోట్లకేసులో ఒక దొంగున్నాడని భోగట్టా చేరింది సార్. వాడి వర్ణన కూడా ముందుగానే వచ్చింది సార్. కాని మీరేం అనుకోకండి. పొరపాట్లెవరికైనా వస్తాయ్. వీడు మీతోటే ఎచ్చి మీ చేతే నోట్లు పెట్టి మోయిస్తాడని అనుకోలేదు సార్. తప్పంతా మాదే సార్. ఇంకెప్పుడూ యిలాంటి పొరపాట్లు రాకుండా చూసుకుంటాను' అని ప్రాధేయ పూర్వకంగా రాజేశ్వ్రరావుకి ఆ సాయంత్రం వివరించాడు సి ఐ, యిటుపైని రాజేశ్వ్రరావు పక్కనమహాత్మాగాంధి లాంటి మనిషి నిలబడ్డా అతగాణ్ణి ఖూనీకోరుగానూ, కావు సారా చేసేవాడుగాను, చూస్తానని ప్రామిస్ చేస్తున్నట్టు.

ఆనాటినుంచి మరి సిక్స్త్ సెన్సు గురించి రాజేశ్వ్రరావు మాట్లాళ్ళేదు.

□□□